COMMUNIST PARTY OF INDIA (MARXIST)

ANDHRA PRADESH COMMITTEE

H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ ప్రసారార్థం:

విజయవాడ,
**తేది : 5 మే, 2017.**

**మిర్చి క్వింటాల్‌కు రూ.10 వేలకు మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది. మిర్చి రైతులపట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న మోస పూరిత వైఖరిని సిపిఐ(యం) ఖండిస్తున్నది.**

రాష్ట్రంలో పండించిన మిర్చి పంటకు కనీస మద్దతు ధరలేక మిర్చి రైతులు విలవిల్లాడుతున్నారు. మార్కెట్‌కు వచ్చిన మిర్చిని కొనే నాధుడు లేక రైతులు పడిగాపులు పడుతున్నారు. సమస్య ఇంత తీవ్రంగా వున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నెపం మోపుతూ రైతును దళారులకు వదిలేశారు. క్వింటాల్‌కు రూ.1500 బోనస్ ఇస్తామని చెప్పి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకున్నది. వాస్తవానికి బోనస్ రావాలంటే మార్కెట్ యార్డుల్లోనే రైతులు అమ్ముకోవాలి. కానీ యార్డుల్లో కొనుగోళ్ళు జరక్క ఇప్పటికే వందలాది లారీలు మిర్చి లోడుతో మార్కెట్ యార్డు నిండా వున్నాయి. లారీల కిరాయిలు భరించలేక అయినకాడికి దళారులకు అమ్ముకుంటున్నవారికి ప్రభుత్వ బోనస్ ఏ విధంగా అందుతుందో ప్రకటించలేదు.

మరోవైపు మిర్చి రైతులను ఆదుకుంటామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం రూ. 5000 మాత్రమే కనీస మద్దతు ధరను ప్రకటించడం రైతులకు అన్యాయం చేయడమే. రాష్ట్రంలో సుమారు 8.5 లక్షల టన్నులు మిర్చి దిగుబడి వస్తే కేవలం 88 వేల టన్నులు మాత్రమే కొనుగోలు చేస్తామని చెప్పడం రైతులను దగా చేయడమే. ఇప్పటికే మిర్చి ధరకు మద్దతు ధర లేక నష్టపోయిన రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం ఇలాగే కొనసాగితే మిర్చి రైతుల బలవన్మరణాలు మరింత పెరిగే ప్రమాదం వుంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి మార్క్‌ఫెడ్ ద్వారా రైతులవద్దనున్న మిర్చినంతా క్వింటా రూ.10 వేల చొప్పున కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

**(పెనుమల్లి మధు)**
రాష్ట్ర కార్యదర్శి